క్లుప్తంగా

రక్తదానం చేయాలి



రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ శివశంకర్ రెడ్డి తెలిపారు. గురువారం జేబీవీఎస్ ది ప్రిజర్వ్ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ నగర్‌లో ప్రాజెక్ట్ ఔషధ సమర్పణలో భాగంగా రక్త గ్రూప్ నిర్ధారణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శివశంకర్ రెడ్డి రక్తదాన ఆవశ్యకతను తెలియజేశారు. సంస్థ వ్యవస్థాపకులు అశోక్ మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ తమ రక్త గ్రూప్‌ను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అంతేకాకుండా సామాజిక మాధ్యమాలైన ఫేస్ బుక్, వాట్సప్,ట్విట్టర్ ప్రొఫైల్ లో తమ రక్త గ్రూప్ ను నమోదు చేసుకున్నట్లయితే ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న వారి ప్రాణాలు కాపాడిన వారవుతారన్నారు. ఈ రక్త గ్రూపు నిర్ధారణ కార్యక్రమానికి సహకారాన్ని అందించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు యుగంధర్, సుజితలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్స్ రాహుల్, సాయి హర్ష, రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడల సాధనను కొనసాగించాలి



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో డీఎస్‌డీఓ తదితరులు

కడప స్పోర్ట్స్: వేసవి శిక్షణ శిబిరాలకు విచ్చేసిన చిన్నారులు తమ క్రీడాసాధనను కొనసాగించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథరెడ్డి సూచించారు. కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో గత నెలరోజులుగా నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ వేసవి శిక్షణ శిబిరం ముగింపు సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్‌డీఓ మాట్లాడుతూ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు క్యాంపునకు విచ్చేసిన చిన్నారులు చక్కగా శిక్షణ పొందారన్నారు. ప్రతిరోజూ స్టేడియంకు విచ్చేసి క్రీడాసాధన చేయడం ద్వారా ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలని ఆకాంక్షించారు. బ్యాడ్మింటన్ అంతర్జాతీయ అంపైర్, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం చైర్మన్ ఎస్. జిలానీ బాషా మాట్లాడుతూ క్రీడాకారులకు ఆటపట్ల అంకితభావంతో పాటు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమన్నారు. క్రీడల్లో రాణించాలనుకునే వారు క్రమం తప్పక సాధన చేయాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన క్రీడాకారులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ శిక్షకులు సుదర్శన్ సిద్దిఖ్, జాకీర్, అబ్దుల్‌మునాఫ్, వెంకటరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

24 మంది దివ్యాంగ పిల్లల గుర్తింపు

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు మండల స్థాయిలో దివ్యాంగ పిల్లల గుర్తింపు సర్వే చేస్తున్నామని, ఇప్పటి వరకు 24 మంది దివ్యాంగ పిల్లలను గుర్తించామని ఐఈఆర్పీలు సంగీతలక్ష్మి, లక్ష్మిరెడ్డి తెలిపారు. సమగ్రశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖాధికారులు సావిత్రమ్మ, శోభారాణి ఆదేశాల మేరకు ఈ సర్వేను నిర్వహిస్తున్నామని వారు పేర్కొన్నారు. 1 నుంచి 18 ఏళ్లలోపు గల దివ్యాంగ పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలలో ఎన్‌రోల్ చేయడం, 21 రకాల వైకల్యాల పిల్లలను గుర్తించి వారికి భవిత కేంద్రంలో తగిన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వారు వైకల్యాన్ని అధికమించి సాధారణ పిల్లల వలే తమ పనులను తాము చేసుకోవడం, వారిలోని నైపుణ్యాలను వెలికి తీయడం , ప్రభుత్వం అందించే అలవెన్స్‌లను వారి తల్లుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ సర్వే జూన్ 9వ తేదీ వరకు కొనసాగుతుందని, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాల్లో సమాచారాన్ని సేకరిస్తున్నామన్నారు.

పరిసరాల శుభ్రతతో దోమల నివారణ

ప్రొద్దుటూరు క్రైం : పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే దోమలు వృద్ధి చెందకుండా నివారించవచ్చని కామనూరు వైద్యాధికారి హనీఫ్‌బాబా తెలిపారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా గురువారం చౌడూరు గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పనికిరాని డబ్బాలు, ప్లాస్టిక్ బాటిళ్లు, తొట్లలో వర్షపు నీరు నిలువ ఉండటం వలన కలిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. దోమలు వృద్ధి చెందితే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా తదితర వ్యాధులు వస్తాయని డాక్టర్ తెలిపారు. జ్వరంతో బాధపడుతున్న వ్యక్తిని కుట్టిన దోమ ఇతరులకు కుట్టడం వలన వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతున్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, సీహెచ్‌ఓ గౌతమి, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఏఎన్ఎం వేదవతి, ఆశా వర్కర్లు పద్మావతి, సంజమ్మ, వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

ఆలయాలలో విశేష పూజలు

కడప కల్చరల్ : శనీశ్వరస్వామి జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక ఆర్కేనగర్‌లోగల శ్రీ సాయి శనీశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనం, కలశస్థాపన, మూలమంత్ర జపం, నవగ్రహారాధన నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా శనీశ్వర శాంతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూర్తికి నువ్వులనూనెతో విశేష అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు నువ్వుల నూనెతోపాటు నల్ల నువ్వులను స్వామికి సమర్పించారు. ముదురు ఎరుపురంగు పూలతో పూజించారు. మధ్యాహ్నం భక్తులందరికీ నిర్వాహకులు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.



విశేష అలంకారంలో శ్రీ కాలభైరవస్వామి



విశేష అలంకారంలో శ్రీ శనీశ్వరస్వామి



కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి దంపతులను ఆశీర్వదిస్తున్న దేవుని కడప ఆలయ అర్చకులు



కాలభైరవునికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



శనీశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

- కడప నగర శివార్లలోని మగ్దూం సాహెబ్ కొట్టాలు గ్రామంలోగల శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవ స్వామికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత స్వామి మూలమూర్తికి అభిషేకం, అష్టోత్తర సేవ, కుష్మాండ దీపారాధన తదితర పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకోవడంలో భాగంగా గుమ్మడికాయలు సమర్పించి ప్రత్యేకంగా దీపాలు వెలిగించారు. అనంతరం సామూహిక పూజలు చేశారు. బాసట స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు మేరువ బాలాజీరావు బృందం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దేవుని కడపలో పూజలు

కడప రూరల్ : తెలుగుదేశం పార్టీ కడప అసెంబ్లీ ఎమ్మెల్యేగా ఎన్నికైన మాధవీరెడ్డి గురువారం దేవుని కడపలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకున్న ఆమెకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శింపజేసి వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఆవరణంలో వారిని ఘనంగా సత్కరించి వేదాశీస్సులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో మాధవీరెడ్డి భర్త, పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శిల్పారామంలో షూటింగ్ సందడి

కడప అర్బన్: నగరంలోని స్థానిక దేవా డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి ప్రత్యేక నృత్య శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని గురువారం ‘శిల్పారామం’లో షూటింగ్ సందడితో నిర్వహించారు. ఈ షూటింగ్ కార్యక్రమంలో విద్యార్థులు, తమ తల్లిదండ్రులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. కవర్ సాంగ్ షూటింగ్‌ను నిర్వహించి అలరించారు. భవిష్యత్తులో విద్యార్థులకు నృత్యప్రదర్శనలో శిక్షణ ఇప్పించాలనే నూతనోత్సాహాన్ని వారిలో నింపారు. కార్యక్రమంలో కొరియోగ్రాఫర్ దేవా, డీపీఓ ఇస్మాయిల్, కెమెరామెన్ ప్రసాద్, డైరెక్టర్ జిలాన్, శిల్పారామం ఏఓ మునిరాజు పాల్గొన్నారు.



కడప శిల్పారామంలో నృత్య ప్రదర్శనతో అలరిస్తున్న చిన్నారులు
(ఇన్‌సెట్) నృత్య ప్రదర్శనను తిలకిస్తున్న తల్లిదండ్రులు

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

కడప అర్బన్: ఎన్నికల కౌంటింగ్ అయిపోయిన తరువాత కొందరు ఇతరులను రెచ్చగొట్టినా, ఎవరైనా అల్లర్లకు పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామనిని కడప చిన్నచౌక్ సీఐ పి. నరసింహారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం అశోక్‌నగర్‌లో పోలీసు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే తక్షణమే సమాచారం అందించాలని కోరారు. అనుమానిత వ్యక్తులను పూర్తి స్థాయిలో విచారించారు. ఈ కార్యక్రమంలో సీఐతో పాటు ఎస్ఐలు పి. రవికుమార్, మహమ్మద్ రఫీ, కేంద్రసాయుధ బలగాల పోలీసులు పాల్గొన్నారు.

– కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ సి. భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐలు మధుసూదన్ రెడ్డి, రంగస్వామిలు తమ సిబ్బందితో పాటు కేంద్ర సాయుధబలగాలతో వివిధ ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.



చిన్నచౌక్ ప్రాంతంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న సీఐ పి. నరసింహారెడ్డి

అంధకారంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్

కమలాపురం : కమలాపురం పట్టణంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో అంధకారం నెలకొంది. కరెంట్ కోత ఉన్న సమయంలో బ్యాంక్‌లో చిమ్మ చీకటి నెలకొంటోంది. ఒక్క ఫ్యాన్ తిరగదు. కేవలం క్యాషియర్ కౌంటర్‌లో మాత్రమే ఒక చిన్న ఎల్ఈడీ బల్బు వెలుగుతోంది. కంప్యూటర్లకు మాత్రమే బ్యాటరీలు అమర్చడంతో సేవలకు ఇబ్బంది లేదు. విద్యుత్ సరఫరా లేని సమయంలో ఇటు సిబ్బంది, అటు ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం వర్షం కారణంగా పట్టణంలో దాదాపు 5–6 గంటల పాటు విద్యుత్ సరఫరా లేదు. ఈ సమయంలో బ్యాంక్‌కు వచ్చిన ఖాతాదారులు ఇబ్బందులు పడ్డారు. కోట్ల రుపాయల వ్యాపారం చేసే బ్యాంక్‌లో ఈ పరిస్థితి ఏమిటని ఖాతాదారులు ప్రశ్నిస్తున్నారు. చిన్న ఇంట్లో సైతం విద్యుత్ సరఫరా లేని సమయంలో ఇన్వర్టర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. అలాంటిది వందల మంది ఖాతాదారులు వచ్చే ఇంత పెద్ద బ్యాంక్‌లో ఇన్వర్టర్లు గానీ జనరేటర్ గానీ లేక పోవడం దారుణం అని, ఇప్పటికైనా బ్యాంక్ ఉన్నతాధికారులు స్పందించి బ్యాంక్‌లో ఇన్వర్టర్లు గానీ, జనరేటర్ గానీ అమర్చి ఇబ్బందులను తొలగించాలని ఖాతాదారులు కోరుతున్నారు.



చీకటిలోనే ఖాతాదారులకు సేవలు అందిస్తున్న ఏపీజీ బ్యాంక్ సిబ్బంది

చినుకుతో చిగురిస్తున్న ఆశలు



రాజోలి ఆనకట్ట నుంచి కుందూనదిలోకి పోతున్న నీరు

రాజుపాళెం : కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు అన్నదాతలో ఆశలు చిగురింపజేస్తున్నాయి. ఖరీఫ్‌కు ఈ వర్షం ఊపిరిపోస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులుగా రాజోలి ఆనకట్టలో అడపాతడపా నీరు పారుతూ ఉండేది. అయితే ప్రస్తుతం కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పలు గ్రామాల్లో కురుస్తున్న వర్షం నీరంతా రాజుపాళెం మండలంలోని రాజోలి ఆనకట్టకు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో రాజోలి ఆనకట్ట, కుందూనది ప్రాంతంలో జలకళతో పాటు చల్లని ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. గతంలో ఆనకట్టలో 600 క్యూసెక్కులు మాత్రమే ఉండగా గురువారం ఆనకట్ట నుంచి కుందూనదిలోకి 7,189 క్యూసెక్కులు నీరు పోతోందని కేసీ కెనాల్ అధికారులు తెలిపారు. ఇది వర్షం నీరేనని, రైతులు గమనించాలని అధికారులు సూచించారు.



టంగుటూరు గ్రామ సమీపాన కుందూనదిలో పోతున్న వర్షం నీరు

బస్టాండు జలమయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలో గురువారం మధ్యాహ్నం కొద్దిసేపు కురిసిన వర్షానికి ఆర్టీసీ బస్టాండు ఆవరణం నీటితో నిండింది. వర్షపు నీరు బయటికి వెళ్లేందుకు వీలు లేకపోవడంతో ఆవరణంలో ఇలా నిల్వ ఉంటోంది. ప్రయాణీకులు వర్షపు నీటితో ఇబ్బందులు పడ్డారు. బస్టాండులో వర్షపు నీరు నిలబడకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు కోరుతున్నారు.



ఇంటర్ అడ్మిషన్లపై దృష్టి పెట్టండి

వేంపల్లె : ఇంటర్ అడ్మిషన్లపై అధ్యాపకులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రొద్దుటూరు ఉప విద్యాశాఖ అధికారి కృష్ణయ్య కోరారు. గురువారం స్థానిక జిల్లా బాలికల ప్లస్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. అలాగే ఇంటర్ అడ్మిషన్లపై పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. అడ్మిషన్లు ఎక్కువగా అయ్యే విధంగా ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శ్రీనివాసులు స్థానిక మదీనాపురంలో ఇంటర్ విద్యార్థుల ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ప్రభుత్వ కళాశాలలో అన్ని మౌలిక వసతులు, సదుపాయాలు కల్పిస్తారని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాసులుతో మాట్లాడుతున్న ఉప విద్యాశాఖ అధికారి కృష్ణయ్య

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

కమలాపురం : మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు నివారణ మందుల దుకాణాదారులు నాణ్యమైన ఉత్పత్తులు విక్రయించాలని ఏఓ సరస్వతి తెలిపారు. గురువారం మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు నివారణ మందుల దుకాణాలను ఆమె పరిశీలించారు. రికార్డులు, నిల్వ ఉన్న స్టాక్, నోటీస్ బోర్డులో ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు నివారణ మందులు మాత్రమే విక్రయించాలన్నారు. డీలర్లు నిబంధనలకు లోబడే విక్రయాలు జరపాలన్నారు. ఎంఆర్‌పీకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి ఉన్న దుకాణాల్లోనే రైతులు కొనుగోలు చేయాలన్నారు. అనంతరం డీలర్స్‌కు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాగార్జునరెడ్డి, ఎరికలరెడ్డి, సుబ్బారెడ్డి, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

వీరపునాయునిపల్లె : విత్తనాలు, పురుగు నివారణ మందులు, ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్యామ్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. దుకాణాల్లో ఉన్న నిలువలకు సంబంధించిన రికార్డులు, ధరల పట్టికలను ఆయన పరిశీలించారు. అనంతరం దుకాణ దారులకు పలు సూచన లిచ్చారు. రైతులకు విక్రయించే ఉత్పత్తుల్లో ఏమైనా పొరపాట్లు జరిగితే దుకాణ యజమానిపై గానీ సంబంధిత కంపెనీలపై కేసులు నమోదు చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.



కమలాపురం : దుకాణంలో నోటీస్ బోర్డు పరిశీలిస్తున్న ఏఓ సరస్వతి



పులివెందుల రూరల్ : రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి నాగలక్ష్మి

ఎరువు దుకాణాల తనిఖీ

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయ అధికారి నాగలక్ష్మి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులకు ఎరువులు, విత్తనాలు, మందులు అమ్మేటప్పుడు బిల్లులు ఇవ్వాలన్నారు. దుకాణంలోని విత్తనాల రకాలను స్టాక్ బుక్‌లో పొందుపరచాలన్నారు. స్టాక్ బుక్‌లో బ్యాలెన్స్, గ్రౌండ్ బ్యాలెన్స్ వివరాలను పరిశీలించడం జరిగిందన్నారు.

కాలం చెల్లిన ఉత్పత్తులు ఉంచరాదు

ఎర్రగుంట్ల : విత్తన దుకాణాలలో కాలం చెల్లిన ఉత్పత్తులను ఎట్టి పరిస్థితుల్లో ఉంచరాదని మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం ఎర్రగుంట్ల పట్టణంలోని దుకాణాలను తనిఖీ చేసి విత్తనాలు, స్టాక్ వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు విత్తన నియంత్రణ చట్టం 1983 ప్రకారం, అలాగే విత్తన నియమ నిబంధనలు 1986ను అనుసరించి వ్యాపార లావాదేవీలు కొనసాగించాలని కోరారు. ప్రతి రోజు స్టాక్ రిజిస్టర్లను అప్‌డేట్ చేసి ఉంచుకోవాలని, అలాగే బిల్లు పుస్తకాలు సక్రమంగా రాసి పెట్టుకోవాలని తెలిపారు. ధరల పట్టిక సక్రమంగా రాసి పెట్టుకోవాలని కోరారు.




వీరపునాయునిపల్లె : నిల్వలపై రికార్డులను తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు



ఎర్రగుంట్ల : స్టాక్ నిల్వను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి

అగస్త్యేశ్వరునికి భస్మహారతి



భస్మార్చనలో అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో గురువారం అమావాస్య సందర్భంగా ఉజ్జయిని మహాకాళేశ్వరునికి చేసే విధంగా ఘనంగా భస్మహారతి ఇచ్చారు. వేకువజామున అగస్త్యేశ్వరునికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం అగస్త్యేశ్వరుని మూలవిరాట్‌ను వేద పండితులు భస్మంతో అభిషేకించారు. అనంతరం భస్మహారతి ఇచ్చి భక్తిశ్రద్ధలతో పరమేశ్వరున్ని ప్రార్థించారు. ప్రతి నెల అమావాస్య రోజున స్వామివారికి భస్మహారతి పూజాకార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, వేదపాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బ్యాటరీలు చోరీ

రాజుపాళెం : మండలంలోని గాదెగూడూరు గ్రామంలోని నాలుగు ట్రాక్టర్లలో ఉన్న బ్యాటరీలు, రెండు టేపురికార్డులు చోరీకి గురైనట్లు బాధిత రైతులు గురువారం తెలిపారు. కొత్త వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి ఈ చోరీకి పాల్పడి ఉండవచ్చునని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో బ్యాటరీ విలువ దాదాపు రూ.4 వేల వరకు ఉండవచ్చునని, మొత్తం రూ.22 వేలు ఉంటుదన్నారు.

రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి

చింతకొమ్మదిన్నె : రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఏపీ రైతు సంఘం కృషి చేస్తోందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి తెలిపారు. గురువారం చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లె పంచాయితీలో రైతు సంఘం సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి పంటలు పండిస్తున్నా, కష్టానికి తగిన ప్రతిఫలం రాకపోగా అప్పులు, ఆత్మహత్యలు మిగులుతున్నాయన్నారు. పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయని, ఎరువులు, పురుగు నివారణ మందులు, వ్యవసాయ పరికరాలు, పెట్రోల్, డీజిల్, రవాణా చార్జీల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. దేశానికి రైతే వెన్నెముక అంటూనే వెన్నెముక విరిగిపోయేలా ప్రభుత్వాలు భారాలు వేస్తున్నాయని తెలిపారు. ఇటువంటి తరుణంలో ఏపీ రైతు సంఘం రైతాంగ సమస్యలపై శక్తి మేరకు నిరంతరం పోరాడుతున్నదని, భూనిర్వాసిత రైతులకు అండగా నిలుస్తోందన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు పంటలు నష్టపోయిన సందర్భాలలో నష్టపరిహారాల కోసం, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల కోసం ధర్నాలు, రాస్తారోకోలు, కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళనలు నిర్వహిస్తోందని తెలిపారు. భూసేకరణ పేరుతో రైతుల భూములను తక్కువ నష్టపరిహారం ఇచ్చి బలవంతంగా లాగేసుకుంటున్నారని తెలిపారు. బడ్జెట్లలో వ్యవసాయరంగానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కొరత కారణంగా సాగునీటి ప్రాజెక్టులు నత్తనడకన నడుస్తున్నాయన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి రైతు సంఘాన్ని మరింత బలపరుచుకోవాలని, రైతులందరూ రాజకీయాలకతీతంగా ఐక్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, సికేదిన్నె మండల అధ్యక్షులు చిన్న సిద్దయ్యతోపాటు రైతులు పాల్గొన్నారు.